క్లుప్తంగా

జాతరలో దుకాణాల వేలం



దుకాణాలకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

పలమనేరు: పట్టణంలోని గంగమ్మ జాతర సందర్భంగా ఆలయం వద్ద దుకాణాల ఏర్పాటుకు గేటు వసూలుకు సంబంధించిన స్థానిక ఆలయం వద్ద శనివారం వేలం పాటలను ఎండోమెంట్ అధికారులు నిర్వహించారు. ఇందులో అత్యధికంగా రూ.2.29లక్షలకు ఓ వ్యక్తి గేటును దక్కించుకున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీధర్, ఈఓ కమలాకర్, కమిటీ సభ్యులు, పట్టణ వాసులు పాల్గొన్నారు.

భారత సైన్యానికి మద్దతుగా ర్యాలీ



జాతీయ జెండాలతో ర్యాలీ

పలమనేరు: భారత సైన్యానికి, కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక మెయిన్‌రోడ్డులో మానవహారం చేపట్టి పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తులసీనాథంనాయుడు, పుష్ప, గుణశేఖర్, సీతారామయ్య, నరేంద్రబాబు, భార్గవి, దేవేంద్ర పాల్గొన్నారు.

గరుడ వాహనంపై రామలింగేశ్వరుడు



కుప్పం: పట్టణంలో రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా శనివారం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. పురాతన రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని జీర్ణోద్ధరణ కుంభాభిషేకం, విగ్రహ పునఃప్రతిష్ఠను పూర్తి చేసి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా శనివారం గరుడవాహనంపై స్వామివారు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. నేడు ఆలయ ప్రాంగణంలో సీతారామ కల్యాణం, గిరిజా కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆర్‌యూబీ కింద నిలిచిన లారీ

- రాకపోకలకు తీవ్ర అంతరాయం



డీకే పల్లి అండర్ బ్రిడ్జి వద్ద నీట నిలిచిన లారీ

కుప్పంరూరల్: కుప్పం పట్టణాన్ని రెండుగా విడదీస్తున్న బెంగళూరు–చెన్నై రైల్వే మార్గంలో డీకే పల్లి, కొత్తపేట వద్ద రెండు ఆర్‌యూబీ (రైల్వే అండర్ బిడ్జి)ల నిర్మాణం చేపట్టారు. ప్రజల సౌకర్యార్థం నిర్మించిన ఈ రెండు బ్రిడ్జిలు వర్షం పడితే అవే జనం పాలిట శాపంగా మారుతున్నాయి. శుక్రవారం రాత్రి కుప్పం పట్టణంలో భారీ వర్షం కురవడంతో రెండు అండర్ బ్రిడ్జిల కింద పెద్ద ఎత్తున నీరు చేరింది. దీంతో ఉదయం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. డి.కె.పల్లి అండర్ బ్రిడ్జి కింద నీటిలో లారీ నిలిచిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. శనివారం మధ్యాహ్నం లారీని తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. ఈ మధ్యలో వాహనదారులు కొత్తపేట చుట్టుకుని పట్టణానికి రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కొత్తపేట బ్రిడ్జి వద్ద మాత్రం వర్షపు నీటితో తంటాలు పడుతూ వాహనదారులు రాకపోకలు సాగించారు

వీరసైనికునికి జోహార్



మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

పుంగనూరు: పాకిస్తాన్ సరిహద్దుల్లో వీరమరణం పొందిన సైనికుడు మురళీనాయక్‌కు పట్టణంలోని పలువురు నివాళులర్పించారు. శనివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత నేత ఎస్ఆర్.అశోక్, బీజేపీ నేత అయూబ్‌ఖాన్, నరసింహులు, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

పీవీ రావుకు నివాళి

పుంగనూరు: మాలమహానాడు వ్యవస్థాపకులు డాక్టర్ పీవీ రావు 76వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్ఆర్.అశోక్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత నాయకులు శ్రీనివాసులు, ఏడూరు శ్రీనివాసులు, నాగరాజ, శీను, మంజు, మోహన్, గంగ పాల్గొన్నారు.

వేలిముద్ర పెట్టు.. క్యాష్ పట్టు

- చారాలలో రేషన్ షాప్ డీలర్ నిర్వాకం
- బియ్యం తగ్గించి రాళ్లు పెట్టి తూకం
- కార్డుకు కేజీ నుంచి 2 కేజీలు స్వాహా
- చక్కెరనూ వదలని వైనం, పప్పులొస్తే ఇక అంతే
- ప్రశ్నించిన వారిపై చిందులు
- అక్రమ వ్యాపారానికి అండగా అధికారులు



రేషన్ బియ్యం తూకం వేసి డబ్బులిస్తున్న డీలర్ భార్య



చారాలలో డీలర్ ఇంటి వద్ద రాళ్లు పెట్టి తూకం వేస్తున్న దృశ్యం



డీలర్ ఇంటి వద్ద గుమిగూడిన కార్డుదారులు

చౌడేపల్లె: ప్రభుత్వ సొమ్మే కదా..మీరే తినాలా.. మేము తినకూడదా? ఒక నెల బియ్యం నాకిస్తే ఏమి? మీకు ఏ సాయం కావాలంటే అది నేను చెయ్యనేమీ?.. నా వద్ద ఆఫీసర్లు, అధికార పార్టీ నాయకుల అండదండలున్నాయి. ఏమీ భయపడద్దు ఏమి కావాలో చెప్పునాయనా..నీకేమి కావాలో చెప్పమ్మా..రా..వేలిముద్ర పెట్టు..డబ్బిస్తా తీసుకుపో అన్న మాటలు ఎవరివో కాదు. సాక్షాత్తు నిత్యావసర వస్తువులు విక్రయించే ప్రభుత్వ రేషన్ షాపు డీలర్ మాటలివి. ఆయన చెప్పిన మాట ప్రకారం చౌడేపల్లె మండలం చారాల రేషన్ షాపు నంబర్ 14లో రేషన్ షాపు డీలర్‌కే కార్డుదారులకు ఇవ్వాల్సిన బియ్యాన్ని నగదు చెల్లించి ఆయనే కొనుగోలు చేస్తున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చౌడేపల్లె మండలంలో మొత్తం 33 రేషన్ షాపులున్నాయి. వాటి పరిధిలో మొత్తం 13,274 కార్డులు ఉన్నాయి. ప్రతినెలా 2, 25,145 కేజీల బియ్యాన్ని ప్రభుత్వం మంజూరుచేస్తోంది. బియ్యంతో పాటు ప్రతి కార్డుదారునికి అర్ధ కేజీ చక్కెర, కేజీ కందిపప్పును పంపిణీ చేస్తున్నారు. ప్రతి కార్డుదారునికి ప్రభుత్వమిచ్చే బియ్యంతోపాటు సరుకులు చేర్చాలని ప్రభుత్వం ఊదరకొడుతున్నా కిందిస్థాయిలో వాటిని అమలు చేయడం లేదని ఆరోపణలు బలంగా వినిపిస్తోంది.

కొందరికే చక్కెర.. మిగిలినవి హుష్..

తొలుత బియ్యం తీసుకునేందుకు వెళ్లిన వారిలో కొందరికే చక్కెర ఇస్తున్నారు. రేషన్ డీలర్లకు అనుకూలమైన వారికి మాత్రమే ఆలస్యంగా వెళ్లిన అన్ని సరుకులు ఇస్తున్నారు. మిగిలిన వారికి ఇవ్వడం లేదు. మిగిలినవి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని లబ్ధిదారులు ఆరోపించారు. పగలు బియ్యం పంపిణీ చేయకుండా రాత్రి పూట 9.30 గంటల వరకు బియ్యం సరఫరా చేయడం వలన కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి వెళ్లి బియ్యం తెచ్చే క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. చక్కెర ఇవ్వలేదని ప్రశ్నించిన వారిపై స్టాకు అయిపోయింది. ముందే రావాల్సి ఉంది. అంటూ చిందులు వేస్తుండడంతో వారు నొక్కేయగా మిగిలిన బియ్యాన్ని తీసుకొని ఆవేదనతో నోరెత్తకుండా వెళ్లాల్సి వస్తోంది.

స్టాకు తనిఖీ చేయడం లేదు?

ప్రతినెలా స్టాక్‌ను అధికారులు తనిఖీ చేయాల్సి ఉండగా ఎక్కడా తనిఖీలు చేయడంలేదు. అక్రమ వ్యాపారానికి డీలర్లకు అధికారులే సహకరిస్తూ అండగా నిలుస్తున్నారు. పేదల బియ్యాన్ని రెవెన్యూ అధికారులు, పౌరసరఫరాల శాఖ తనిఖీ అధికారుల పర్యవేక్షణ లోపంతో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. పేదలకు ఇవ్వాల్సిన బియ్యం బొక్కేయకుండా సక్రమంగా పంపిణీ చేసేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బియ్యం తీసుకొని డబ్బులిచ్చేస్తున్నారు..

రేషన్ షాపు 14లో డీలర్ పేదలకిచ్చే బియ్యాన్ని గద్దల్లా తన్నుకొని వెళ్తున్నారు. కేజీ బియ్యం రూ.15 నుంచి రూ.20 చెల్లించి కార్డుదారుల నుంచి వేలిముద్ర వేసుకొని బియ్యాన్ని తీసుకొని నగదు చెల్లిస్తున్నారు. ఈ తతంగం అంతా రేషన్ షాపులో కాకుండా డీలర్ తన ఇంటి వద్ద వ్యాపారం సాగిస్తున్నారు. ఆయన వ్యాపారానికి రెవెన్యూ అధికారులు అండదండలున్నాయని ఆరోపణ చేశారు. బియ్యం వ్యాపారం తెలిసినా అధికారులు పట్టించుకోకుండా ఉదాసీనంగా వ్యవహరించడంతో పలు ఆరోపణలు వస్తున్నాయి. బియ్యం స్టాక్ మాత్రం వేరొక చోట పెట్టి అక్కడ ఇస్తూ ఇంటి వద్ద వేలిముద్రలు వేయిస్తూ వ్యాపారానికి మార్గం ఏర్పాటుచేసుకున్నారు.

బియ్యానికి బదులు తూకం రాళ్లు పెట్టి...

షాపులో తూకం స్కేల్‌పై బియ్యాన్ని పెట్టి కార్డుదారుని వేలిముద్రను బయోమెట్రిక్ ద్వారా సేకరించాల్సి ఉంది. కాగా ఇక్కడ మాత్రం తూకం రాళ్లు పెట్టి పనికానిచ్చేస్తున్నారు. వీటితోపాటు కొన్ని రేషన్ షాపుల్లో ప్రతి కార్డుదారునికి బియ్యం తూకం వేసే క్రమంలో కేజీ, 2 కేజీల రాయి పెట్టి సంచి సహ తూకం వేస్తూ పేదల బియ్యం నొక్కేస్తున్నారు.

తహసీల్దార్ ఏమన్నారంటే..

ఈ విషయమై తహసీల్దార్ హనుమంతునాయక్‌ను వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని, విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. పేదలకిచ్చే బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు

నోటీస్ బోర్డు

● నేడు ఓవీసీఐ అవార్డుల ప్రదానం

పలమనేరు: పట్టణంలోని ఎంబీఎస్ ఫంక్షన్ హాలులో నేడు అవర్ విజిలెన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనే సంస్థ ఆధ్వర్యంలో ఓవీసీఐ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరుగుతుందని స్థానిక సంఘ నిర్వాహకులు బాలు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు రిటైర్డ్ జడ్జి హరిదాస్, ఆర్గానిక్ ఫార్మింగ్ ట్రైనర్ రాజేంద్రన్, జైల్ సూపరింటెండెంట్ భాస్కరన్, ప్రపంచ సైక్లింగ్ చాంపియన్ సౌందర్‌రాజన్ హాజరుకానున్నట్లు అందులో నిర్వాహకులు తెలిపారు.

● రేపు మొలకల పౌర్ణమి ఉత్సవం

సదుం: మండలంలోని చెరుకువారిపల్లె బొమ్మసముద్రం ఎల్లమ్మ ఆలయంలో ఈనెల 12న మొలకల పౌర్ణమి ఉత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆరోజు ఆలయంలో గణపతి, నవగ్రహ పూజ, హోమాలు, అభిషేకం, సాయంత్రం మొలకల నోములు, పుష్పపల్లకీ ఊరేగింపు జరుగుతాయన్నారు.

● నేడు శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి

పుంగనూరు: శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా మండలంలోని ఏడూరులోని శ్రీలక్ష్మీనరసింహస్వామి, గూడూరుపల్లెలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జయంతి ఉత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులుకావాలని ఆలయ అర్చకులు నటరాజస్వామి కోరారు.

● నేడు కంటి వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని బీఎంఎస్ క్లబ్ ఆవరణలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ పి.శివ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల వైద్యులతో ఉదయం 9 గంటల నుంచి ఉచితంగా కంటి వైద్యపరీక్షలు చేయనున్నట్లు తెలిపారు.

మదర్‌థెరిసాలో ముగిసిన క్రికెట్ పోటీలు



విజేతలతో యాజమాన్యం

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు శనివారం ముగిసినట్టు కరెస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. చిత్తూరు, అనంతపురం, అన్నమయ్య, సత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల నుంచి మొత్తం 25 క్రికెట్ జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఈ పోటీల్లో మొదటి స్థానంలో గెలుపొందగా, వైఎస్సార్ కడప జిల్లా వేంపల్లి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు రెండవ స్థానంలో నిలిచారన్నారు. మొదటి బహుమతిగా రూ. 20వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 15వేలు నగదును కళాశాల యాజమాన్యం అందించింది. విజేతలను కళాశాల యాజమాన్యం అభినందించింది.

వైభవంగా గంధం మెరవణి



గంధం ఊరేగింపు

బైరెడ్డిపల్లి: హజరత్ బిస్మిల్లా షాఖాదరి వారి 60వ ఉరుసులో భాగంగా శుక్రవారం రాత్రి వైభవంగా గంధం మెరవణి నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరించిన తాజియాను, కొల్లాం ఫకీర్ల జోహర్లతోను, బ్యాండు మేళాలతో ప్రత్యేక వాహనంలో బైరెడ్డిపల్లె గ్రామ పురవీధుల గుండా గంధం మెరవణి చేపట్టి పెద్ద చెరువు సమీపంలోని దర్గా వద్ద వరకు నిర్వహించారు. శనివారం రాత్రి సిమ్రాన్‌తాజ్, తబ్రేజ్‌ఆలీలచే బ్రహ్మాండమైన ఖవ్వాలి పాట కచ్చేరి నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మిద్దింటి కిషోర్‌బాబుకు డాక్టరేట్



తంగవేల్ నుంచి డాక్టరేట్ అందుకుంటున్న మిద్దింటి కిషోర్‌బాబు

చౌడేపల్లె: భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ బెంగళూరు వారు చౌడేపల్లెకు చెందిన మిద్దింటి కిషోర్‌బాబుకు గౌరవ డాక్టరేట్‌ను శనివారం ప్రదానం చేశారు. బెంగళూరులోని శివానగర్‌లో జరిగిన డాక్టరేట్ అవార్డుల ప్రదానోత్సవానికి చౌడేపల్లెకు చెందిన ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు హాజరయ్యారు. యూనివర్సిటీ సౌత్‌జోన్ చైర్మన్ డాక్టర్ ఎం.తంగవేల్ చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. సామాజిక సేవా కార్యక్రమాలతోపాటు, యువతకు ప్రోత్సాహం, కోవిడ్ సమయంలో ప్రజలకు చేసిన విశిష్ట సేవలను గుర్తించి డాక్టరేట్ అవార్డుతో సత్కరించినట్లు చెప్పారు. డాక్టరేట్‌తో మరింత బాధ్యత పెరిగిందని కిషోర్‌బాబు తెలిపారు. తమ సేవలను గుర్తించిన యూనివర్సిటీ చైర్మన్, బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

కుప్పంరూరల్: ఎస్వీ యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ ఫలితాల్లో కుప్పం డిగ్రీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల చైర్ పర్సన్ శాంత తెలిపారు. బీఎస్సీ (ఎంపీజీ)లో భవాని (9.3) పాయింట్లు, అర్చన (9.2), బీబీఏలో వర్ష (9.02), ప్రతీక్ష (9.0) సాధించినట్లు చెప్పారు. బీకాం సీఏలో నిత్యలక్ష్మి (8.9), దివ్యశ్రీ (8.8) పాయింట్లు వచ్చినట్లు చెప్పారు. బీఎస్సీ (ఎంఎస్‌సీఎస్)లో భువనేశ్వరి (8.9), గుణవతి (8.4) పాయింట్లు సాధించారన్నారు. బీఎస్సీ (బీజెడ్‌సీ)లో విగ్నేష్ (8.9), ప్రవల్లిక (8.6) పాయింట్లు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచినట్లు శాంత వివరించారు. అదేవిధంగా ఫిజిక్స్‌లో ఎనిమిది మంది విద్యార్థులు 10కి 10, స్టాటిస్టిక్స్‌లో ముగ్గురు, కాస్ట్ కంట్రోల్‌లో ముగ్గురు, మ్యాథ్స్‌లో ఇద్దరు 10కి 10 పాయింట్లు సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. ప్రిన్సిపల్ డి.సుధారాణి, అధ్యాపకులు ఉన్నారు.

మదర్‌థెరిసా విద్యార్థుల ప్రభంజనం



కరిష్మా తాజ్(9.25) , వసంత్‌కుమార్(9.19), మహీన్(9.17), రోహిణి(9.16), తనూజ(9.12)

గంగవరం: ఎస్వీ యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ 5వ సెమిస్టర్ ఫలితాల్లో మదర్‌థెరిసా డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించినట్టు కరెస్పాండెంట్ రవీంద్రబాబు శనివారం తెలిపారు. బీకాంలో కరిష్మాతాజ్(9.25), వసంత్‌కుమార్(9.19), కుసుమ(9.15), బీబీఏలో మహీన్(9.17), చందు(9.03), బీఎస్సీలో రోహిణి(9.16), అశ్విని(9.16), బీసీఏలో తనూజ(9.12), శ్రావణి(8.93) పాయింట్లు సాధించి కళాశాల స్థాయిలో టాపర్స్‌గా నిలిచారన్నారు. బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ మూడవ సంవత్సరం 5వ సెమిస్టర్‌లో 265 డిస్టింక్షన్లు, 75 ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్టు పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ మధుసూదన్‌రావు, అధ్యాపకులు అభినందించారు.

వీరజవాన్‌కు నివాళి

కుప్పం: భారత్, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో వీర మరణం పొందిన వీరజవాన్ మురళీనాయక్‌కు పెన్షనర్లు నివాళులర్పించారు. శనివారం కుప్పం ఎన్‌జీహోంలో నియోజకవర్గ పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసినా మురళీనాయక్, పెన్షనర్ రజియా బేగం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించకపోవడం దారుణం అన్నారు. పెన్షనర్ల సంఘ నేతలు సెల్వం, గణేష్ పిళ్లై, వెంకటేష్, శంకరయ్య, మునెప్ప, ప్రభాకర్ పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథకు అంత్యక్రియలను నిర్వహిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు

పలమనేరు: పట్టణంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందిన ఓ యాచకునికి స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు శనివారం గాంధీనగర్ శ్మశాన వాటికలో అంత్యక్రియలను నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలోని రంగబాబు సర్కిల్ వద్ద ఓ యాచకుడు అనారోగ్యంతో బాధపడుతుండగా 108 వాహనంలో స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతిచెందాడు. దీంతో సీఐ నరసింహరాజు సూచనలతో హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు మృతదేహానికి అంతిమ సంస్కారాన్ని నిర్వహించారు. ఇందులో శివ, శక్తిప్రసాద్, మురగ, హరి పాల్గొన్నారు

భారత్ విజయం కోసం పూజలు



హోమాలు చేస్తున్న వేదపండితులు

బైరెడ్డిపల్లె: భారత్–పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో ఇండియా విజయం సాధించాలని మండలంలోని బేలుపల్లె శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సరిహద్దు సైనికులకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వేడుకున్నట్లు వేదపండితులు సత్యనారాయణ, సుబ్బారావు, రాజేంద్ర, గురుప్రసాద్, శ్రీనివాసరావు, మురళీకృష్ణ తెలిపారు.

ఘనంగా శనిత్రయోదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో శనేశ్వరుడు

పుంగనూరు: పట్టణ సమీపంలోని యాబైర్లాళ్ల మొరవ వద్ద గల శనేశ్వరస్వామి ఆలయంలో, రాగానిపల్లి వద్ద వెలసిన ఆలయాల్లో శనివారం శనిత్రయోదశి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి తైలాభిషేకం, అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, నువ్వుల దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు.

బోరుకు కనెక్షన్ ఇవ్వండి



నిరుపయోగంగా బోరు

పుంగనూరు: మండలంలోని వెంకటాద్రి కాలనీలో మూడు నెలల క్రితం నీటి సమస్య ఉందని మంచినీటి బోరు వేశారు. నీళ్లు పడినా విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో బోరు నిరుపయోగమైంది. 100 కుటుంబాలు మంచినీటి కోసం విలవిలలాడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

హనుమంతునిపై శ్రీవారి చిద్విలాసం



హనుమంత వాహనంపై విహరిస్తున్న శ్రీవారు



గజ వాహనంపై శ్రీవారు

గంగవరం: కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శనివారం ఉదయం సర్వాలంకార భూషితుడైన స్వామివారు ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజవాహనంపై గ్రామ పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు కటాక్షించారు. వాహన సేవ ముందు భక్తజన బృందాల డప్పు వాయిద్యాలు, కోలాటాలు, సంకీర్తనల నడుమ వాహనంపై స్వామివారు దేదీప్యమానంగా వెలుగొందుతూ భక్తులను అనుగ్రహించారు. అడుగడుగునా భక్తులు స్వామివారి వాహన సేవ ఎదుట కర్పూర హారతులు పట్టారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు ఆదివారం ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారు విహరిస్తారని ఆలయ అధికారులు తెలిపారు.

హంస వాహనంపై విహరించిన శ్రీవారు



సదుం: మండలంలోని బూరగమందలోని భూదేవి, శ్రీదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారు హంసవాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయంలో తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో చెక్కభజనలు నిర్వహించారు. వెంకటరమణ కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

అశ్వవాహనంపై శివపార్వతులు



అశ్వవాహనంపై విహరిస్తున్న శివపార్వతులు

చౌడేపల్లె: బజారువీధిలోని శ్రీఅభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను అశ్వవాహనంలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామిఅమ్మవారికి కర్పూరహారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదారులుగా అన్నం వంశస్థులు వ్యవహరించారు.

వేడుకగా అఖండ హరినామస్మరణం



భజన చేస్తున్న భక్తులు

వి.కోట: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం వేడుకగా హరినామస్మరణ భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం స్వామివారి నామస్మరణతో మారుమోగింది. అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.